క్లుప్తంగా

డ్రైనేజీల్లో ప్లాస్టిక్ కవర్లు వేయొద్దు


సూచనలు చేస్తున్న కమిషనర్ రాజశేఖర్

సుల్తానాబాద్: డ్రైనేజీలో ప్లాస్టిక్ కవర్లు వేయొద్దని మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ ప్రజలను కోరారు. పారిశుధ్య కార్మికులు చేస్తున్న పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైనేజీలో ప్లాస్టిక్ కవర్లు వేయడంతో రానున్న వర్షాకాలంలో డ్రైనేజీల్లో నీరు నిలిచి ఇళ్లలోకి మురికి నీరు వెళ్లే అవకాశం ఉందన్నారు. ప్రజలు వ్యర్థ పదార్థాలు డ్రైనేజీల్లో వేయొద్దని, స్వచ్ఛ ఆటోలకు ఇవ్వాలని సూచించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న టీఆర్ఎస్ నాయకులు

కమాన్‌పూర్: మండలంలోని జూలపల్లికి చెందిన అబ్బెంగుల కొమురయ్యకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.60వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును మంగళవారం బీఆర్ఎస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బొల్లపెల్లి శంకర్‌గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, బండ రాజలింగు, బొమ్మగాని అనిల్, వినోద్, రామ్మూర్తి, దండె కిషన్, గొడిసెల స్వామి, సాన సురేశ్ ఉన్నారు.

పెద్దమ్మ ఆలయంలో కుంకుమ పూజలు


కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

కమాన్‌పూర్: మండలంలోని రొంపికుంట చెరువు కట్టపై నిర్మించిన పెద్దమ్మ ఆలయంలో మంగళవారం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అనంతరం మహిళలు కుంకుమ పూజలు చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ కులస్తులు పాల్గొన్నారు.

మహావీరుడు ఛత్రపతి శివాజీ


పూలమాల వేస్తున్న సునీల్‌రెడ్డి

మంథని: ఛత్రపతి శివాజీ మహారాజ్ పట్టాభిషేకం సందర్భంగా నిర్వహించే సామ్రాజ్య దినోత్సవాన్ని మంగళవారం మంథనిలో బీజేపీ నాయకులు నిర్వహించారు. మంథనిలోని ఛత్రపతి మహారాజ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. నాయకులు నాంపల్లి రమేశ్, ఎడ్ల సదాశివ్, చిలువేరు సతీశ్, నాంపల్లి రమేశ్, సబ్బని సంతోష్, కొండపాక సత్యప్రకాష్, బోగోజు శ్రీనివాస్, పోతరవేణి క్రాంతికుమార్ పాల్గొన్నారు.

రాష్ట్ర అవతరణ ఉత్సవాలపై సమావేశం


సమావేశమైన అధికారులు

ఎలిగేడు: రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చేపట్టనున్న కార్యక్రమాలపై మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లకు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా దశాబ్ది ఉత్సవాల్లో చెరువుల పండుగ, పల్లె ప్రగతి, హరితోత్సవం కార్యక్రమాలపై చర్చించి, సలహాలు, సూచనలు చేశారు. ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, ఎంపీవో అనిల్‌రెడ్డి, ఏపీవో సదానందం తదితరులు పాల్గొన్నారు.

పాడి పశువులపై అవగాహన

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం కనుకుల గ్రామంలో పశుగణాభివృద్ధి కరీంనగర్, గోపాలమిత్ర కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం పాడి పశువులపై అవగాహన కల్పించారు. గోపాలమిత్ర నేరేళ్ల శ్రీకాంత్ మాట్లాడుతూ పాడి రైతులకు ఆడదూడలు జన్మించే వీర్యం అందుబాటులో ఉందని తెలిపారు. దీని విలువ రూ.600 ఉండగా సబ్సిడీపై రూ.250కే రైతులకు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మేలు జాతి దూడల అభివృద్ధి కోసం రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వ్యవసాయ భూముల్లో వెంచర్లు

- రహదారిని ఆక్రమిస్తూ వెంచర్లు వేస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు
- రాత్రివేళల్లో అక్రమంగా మట్టి తరలింపు
- పట్టించుకోని అధికారులు


పట్టణ శివారులో వరద నీటి ప్రవాహం వెళ్లే స్థలంలో పోసిన మట్టి

సుల్తానాబాద్: పట్టణ శివారులోని వ్యవసాయ సాగుభూమిని కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొనుగోలు చేసి వెంచర్లు వేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నాలాల వద్ద భూమి కొనుగోలు చేసి అక్కడ మట్టితో చదును చేసి నాలాలను కూడా యథేచ్ఛగా ఆక్రమిస్తున్నారు. అంతటితో ఆగకుండా ఎలాంటి అనుమతి లేకుండా మట్టిని రాత్రివేళల్లో అక్రమంగా తరలించి, రహదారిని సైతం కలుపుకొని మట్టి పోస్తున్నారు. పట్టణ శివారులో రోడ్డుపక్కనే ఉన్న ఊర చెరువు నుంచి వరద ప్రవాహం వెళ్లేందుకు కల్వర్టుకు కాలువ నిర్మాణం చేపట్టారు. నాలాలపై నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం రెవెన్యూ, ఇరిగేషన్ స్థానిక మున్సిపల్ అధికారుల అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. వరద నీటి ప్రవాహం వస్తే పలు పంటపొలాలు మునుగుతుండగా వెంచర్ల కోసం మట్టి పోయడంతో వరద నీటి ప్రవాహం పెరిగి పొలాలు చేసుకునే పరిస్థితి ఉండదని రైతులు వాపోతున్నారు. స్థలాలను చదును చేయడంతో భవిష్యత్‌లో ప్రకృతి విపత్తుతో వరద నీటి ప్రవాహం వస్తే పరిస్థితి ఏంటని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

భూములకు రెక్కలు..

మేజర్ గ్రామపంచాయతీ నుంచి మున్సిపల్‌గా మారడంతో సుల్తానాబాద్‌లో భూముల ధరలు భారీగా పెరిగాయి. రూ.లక్ష విలువ చేసే భూమి ప్రస్తుతం రూ.3లక్షల నుంచి రూ.4లక్షల ధర పలుకుతుండడంతో ప్రజలు వ్యవసాయ భూములు అమ్ముకునేందుకు ముందుకు వస్తున్నారు. దీంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొనుగోలు చేసి వెంచర్లు ఏర్పాటు చేసే పనిలో ఉన్నారు.

రాత్రివేళలో అక్రమంగా మట్టి తరలింపు..

రాత్రివేళలో అక్రమంగా మట్టి తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. సుల్తానాబాద్ మండలం చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు ఎలిగేడు మండలం చుట్టుపక్కల గ్రామాల నుంచి సుల్తానాబాద్‌కు మట్టి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపణలు వినవస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం భూగర్భ గనుల శాఖ అనుమతి ద్వారా ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 వరకే మట్టి తరలించాల్సి ఉంటుంది. నిబంధనలకు విరుద్ధంగా మట్టిని తరలిస్తున్నారు. రెవెన్యూ భూగర్భశాఖ అధికారులకు తెలిసినప్పటికీ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

నిబంధనలు అతిక్రమించారు



కల్వర్టు పక్కనే భారీగా మొరం పోయడంతో వరద నీరు వస్తే ఎటు పోతుంది. 30ఫీట్ల మేరకు రహదారికి వదిలిపెట్టాలని నిబంధన ఉంది. నిబంధనలు అతిక్రమించి మట్టి పోశారు. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఆరెపల్లి కిరణ్, కాంగ్రెస్ నాయకుడు, సుల్తానాబాద్

అనుమతి తీసుకోలేదు



వెంచర్ నిర్మాణాలకు మున్సిపల్ కార్యాలయం నుంచి ఎలాంటి అనుమతి తీసుకోలేదు. పొలంలో మట్టి పోశారని ఇంతరకు ఎవరూ ఫిర్యాదు చేయలేదు. నాలాలను ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటాం. సిబ్బందిని పంపి, విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం.

– రాజశేఖర్, మున్సిపల్ కమిషనర్

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యాబోధన


జూలపల్లి: అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు


కమాన్‌పూర్: బేగంపేటలో..


ఫెర్టిలైజర్‌సిటీ: బడిబాటలో హెచ్‌ఎం ఏకాంబరం


రామగుండం: టీటీఎస్ అంతర్గాంలో బడిబాట

జూలపల్లి: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలతో పాటు నాణ్యమైన విద్యాబోధన ఉంటుందని మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సరస్వతి అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం వాడవాడలా తిరుగుతూ విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధనపై అవగాహన కల్పించారు. అబ్బాపూర్, నిమ్మపల్లె గ్రామాల్లో జరిగిన బడిబాటలో బాలుర ఉన్నత పాఠశాల టీచర్లు రమాదేవి, గీతారాణి, వీరమల్లు, లచ్చయ్య, శ్రీనివాస్, పిడి సురేశ్ పాల్గొన్నారు.

కమాన్‌పూర్‌లో..

కమాన్‌పూర్: బడి బాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని గుండారం గ్రామంలో మంగళవారం ప్రభుత్వ ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్వరూప, మల్లయ్య, సతీశ్ పాల్గొన్నారు.

రామగిరి మండలంలో..

రామగిరి మండలంలోని బేగంపేట గ్రామంలో మంగళవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరుతున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బుర్ర పద్మ, ఎంపీటీసీ మారగోని కరుణ, ఎస్‌ఎంఎస్ చైర్మన్ కట్ట శ్రీనివాస్, హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు రాజయ్య, వెంకటేశం, గీతరాణి, అమని, శ్రీనివాస్ పాల్గొన్నారు.

లక్ష్మీపురం గ్రామంలో..

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ లక్ష్మీపురం గ్రామంలో ఎల్కలపల్లి జిల్లా పరిషత్ పాఠశాల హెచ్‌ఎం ఏకాంబరం ఆధ్వర్యంలో మంగళవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు విద్యతోపాటు ఆటల్లో కూడా నైపుణ్యం కలిగేలా శిక్షణ ఇస్తున్నామని పేర్కొన్నారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి

ఎలిగేడు: బడీడు పిల్లలను, బడి మానేసిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని మంగళవారం మండలంలోని శివపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు గ్రామంలో ఇంటింటా ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ దుగ్యాల శ్వేత, పాఠశాల హెచ్‌ఎం గాజుల బాలకృష్ణ, ఎస్‌ఎంసీ చైర్మన్ సతీశ్, కార్యదర్శి వినోద్ కృష్ణ, వార్డుసభ్యులు మల్లేశ్ పాల్గొన్నారు.

గ్రామాల్లో పర్యటన

రామగుండం: అంతర్గాం టీటీఎస్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు రాచర్ల శ్రీనివాస్ గ్రామంలో బడిబాట నిర్వహించారు. దీంతో పాటు అబాది రామగుండంలో హైస్కూల్, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు కూడా బడిబాట నిర్వహించారు.

లయన్స్ క్లబ్ మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డి


శ్రీనివాస్‌రెడ్డి

సుల్తానాబాద్: సుల్తానాబాద్ లయన్స్ క్లబ్ మండల అధ్యక్షుడిగా నోముల శ్రీనివాస్‌రెడ్డిని క్లబ్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. లయన్స్ క్లబ్ సభ్యులు మంగళవారం సమావేశమై ఎన్నుకున్నట్టు ఆయన తెలిపారు. సామాజిక సేవా కార్యక్రమాలను గ్రామీణ ప్రాంతాలకు చేరవేసేందుకు తనవంతు ప్రయత్నం చేస్తానని ఆయన తెలిపారు. క్లబ్ సభ్యులు ఇప్పటికే పలు రకాల సేవలు అందిస్తున్నారని, సేవలను మరింత విస్తృతం పరిచేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


కరస్పాండెంట్‌ను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

సుల్తానాబాద్: పట్టణంలోని ప్రైవేట్ హైస్కూల్‌లో 2000–01లో పదో చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం మంగళవారం నిర్వహించారు. పాఠశాల వ్యవస్థాపకుడు గుజ్జ బుజ్జారావు, ఉపాధ్యాయులు కమలాకర్, ఉమ్మ వెంకటేశం, అస్లాం, చంద్రయ్య, మల్లేశం, వెంకటేశ్వర్లును సన్మానించారు.

అభివృద్ధి పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ శంకరయ్య

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి ప్రభావిత గ్రామమైన రామగిరి మండలం చందనపూర్ ఎస్సీ కాలనీలో చేపట్టిన అభివృద్ధి పనులను సర్పంచ్ దాసరి శంకరయ్య మంగళవారం పరిశీలించారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మించిన ఇళ్లకు మౌలిక వసతులు కల్పించాలని జీఎంకు వినతిపత్రం ఇచ్చారు. స్పందించిన జీఎం శ్రీనివాస్ ఎస్సీ కాలనీవాసుల కోసం సౌకర్యాలు కల్పించాలని సింగరేణి సిబ్బందికి ఆదేశాలు జారీ చేయడంతో పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్, విద్యుత్ ఏఈ శ్రీనివాస్‌కు సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యమకారుడికి నివాళి

మంథని: తెలంగాణ ఉద్యమకారుడు గుండా నాగరాజు వర్ధంతి మంగళవారం మంథనిలో నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ఉన్న నాగరాజు విగ్రహానికి పలువురు నాయకులు నివాళి అర్పించారు.

సంక్షిప్త వార్తలు

✦ బీఆర్ఎస్‌ను ఆశీర్వదించాలి

గోదావరిఖని: రామగుండం పారిశ్రామిక ప్రాంత ప్రజల దశాబ్దాల కలగా ఉన్న మెడికల్ కళాశాలను ఏర్పాటు చేశామని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. 29వ డివిజన్‌లో దశాబ్ది ప్రగతి బాటను మంగళవారం రాత్రి నిర్వహించారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని ఆశీర్వదించి కేసీఆర్‌ను హ్యాట్రిక్ ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే వెంట మేయర్ అనిల్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

✦ నేడు బీరన్న ఉత్సవాలు

జూలపల్లి: మండలంలోని వడ్కాపూర్‌లో శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో బుధవారం శ్రీబీరన్న మాంకాళమ్మ, కమరావతి ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

✦ మిల్లర్ల దోపిడీతో నష్టపోతున్న రైతులు

ధర్మారం: రైస్ మిల్లర్ల దోపిడీతో రైతులు నష్టపోతున్నారని సామాజిక కార్యకర్త మోతె నరేశ్ ఆరోపించారు. రైతు సమస్యల పరిష్కారం కోసం ఆయన చేపట్టిన సైకిల్‌యాత్ర మంగళవారం ధర్మారం మండలం బంజేరుపల్లి, ఎర్రగుంటపల్లి, కమ్మరిఖాన్‌పేట, మల్లాపూర్, అబ్బాపూర్ గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

✦ రైల్వేస్టేషన్లో బైక్ చోరీ

ఓదెల: ఓదెల రైల్వేస్టేషన్‌లో లంబాడితండాకు చెందిన గుగులోతు రాజుకు చెందిన బైక్‌ను గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం చోరీచేశారు. ఉదయం భాగ్యనగర్ రైలుకు తన కుమార్తెను హాస్టల్‌లో చేర్పించి తిరిగి జమ్మికుంట నుంచి ఇంటర్‌సిటీ రైలుకు వచ్చేసరికి రైల్వేస్టేషన్లో పార్కింగ్ చేసిన బైక్‌ను ఎత్తుకెళ్లారు. బైక్ చోరీ విషయంపై పొత్కపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

✦ 15లోగా దరఖాస్తు చేసుకోండి

పెద్దపల్లిరూరల్: పోస్ట్‌మెట్రిక్ ఉపకారవేతనాల కోసం ఈనెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖ అధికారి నాగలేశ్వర్ తెలిపారు. 2022–23 విద్యాసంవత్సరంలో ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో ఇంటర్ ఆపై చదువుతున్న అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, దివ్యాంగులు, మైనార్టీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

✦ ఆర్థికసాయం అందజేత

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్‌లో నిరుపేద కుటుంబానికి చెందిన గాజుల సులోచన కుమార్తె శిరీష వివాహానికి కేసీఆర్ సేవాదళం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జూలపల్లి జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్ రూ.5వేలు, నూతన వస్త్రాలు అందించారు.

మంచినీళ్లు కొనుక్కోవాల్సిన దుస్థితి


మాట్లాడుతున్న దాసరి ఉష

పెద్దపల్లిరూరల్: ప్రత్యేక రాష్ట్రంగా అవతరించిన తెలంగాణలో పేద ప్రజలు ఉండేందుకు ఇళ్లు లేక అవస్థలు పడుతున్నారని, మంచినీళ్లు కొనుక్కోవాల్సిన దుస్థితి నెలకొందని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష అన్నారు. పెద్దపల్లి పట్టణ శివారులోని పెద్దమ్మనగర్‌లో మంగళవారం మన ఊరు..మన ఉష పేరిట చేపట్టిన కార్యక్రమంలో ఆమె ఇంటింటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఉచితంగా అందించాల్సిన తాగునీటిని కొనుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. నాయకులు సవిత, దుర్గయ్య, గోపాల్, అరుణ, శారద, అజీం పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు ప్రశంసాపత్రం


మీ సేవా నిర్వాహకుడికి ప్రశంసాపత్రం అందజేత


పశంసాపత్రం అందుకుంటున్న డీపీఎం రజాక్

రామగుండం: అంతర్గాం మండల కేంద్రంలో మీసేవ కేంద్రం నిర్వహిస్తున్న శానగొండ సురేశ్‌కు మీసేవ రంగంలో ఉత్తమ సేవలు అందించినందుకు కలెక్టర్ సంగీత, ఎమ్మెల్యే చందర్ చేతుల మీదుగా మంగళవారం ప్రశంసాపత్రం అందుకున్నారు.

జిల్లా ప్రాజెక్టు మేనేజర్‌కు..

పెద్దపల్లిరూరల్: జిల్లా పంచాయతీ కార్యాలయంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ (డీపీఎం)గా విధులు నిర్వర్తిస్తున్న రజాక్‌కు కలెక్టర్ సంగీత మంగళవారం ప్రశంసాపత్రం అందించి సత్కరించారు. జిల్లాలోని పంచాయతీలను జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చేలా పంచాయతీ పాలకులు, కార్యదర్శులకు దిశానిర్దేశం చేసి, అంకితభావంతో విధులు నిర్వర్తిస్తున్న రజాక్‌ను స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ కుమార్ దీపక్, డీపీవో చంద్రమౌళి అభినందించారు.

జిల్లా ఈడీఎం కవిత చేతుల మీదుగా..


ప్రశంసాపత్రం అందుకుంటున్న పల్లె బాపు

జ్యోతినగర్: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఎన్టీపీసీ ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్ ఆధార్, మీసేవా కేంద్రం మేనేజర్ పల్లెబాపు ప్రశంసాపత్రం అందుకున్నారు. గోదావరిఖనిలో పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన పారిశ్రామిక ప్రగతి ఉత్సవాల్లో ఆయన విధి నిర్వహణలో ఉండడంతో జిల్లా ఈడీఎం కవిత మీ సేవా కేంద్రానికి వచ్చి పల్లెబాపును అభినందించి ప్రశంసాపత్రం అందించారు.

నష్టపరిహారం చెల్లించాలి


పరామర్శిస్తున్న మక్కాన్ సింగ్

జ్యోతినగర్: ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధమై పశుగ్రాసం నష్టపోయిన కళావతి కుటుంబానికి ప్రభుత్వం పరిహారం చెల్లించాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్ సింగ్ కోరారు. రామగుండం కార్పొరేషన్ మూడో డివిజన్ న్యూపోరట్‌పల్లి గ్రామంలో ఇటీవల ఆరు ట్రాక్టర్ల గడ్డివాము దగ్ధమై నష్టపోయిన నరహరి కళావతి కుటుంబాన్ని మంగళవారం ఆయన పరామర్శించారు. రామగుండం తహసీల్దార్‌ను ఫోన్‌లో సంప్రదించి ప్రమాద ఘటన గురించి వివరించి ఆ కుటుంబానికీ ప్రభుత్వపరంగా పరిహారం అందేలా చూడాలని కోరారు. పార్టీ నాయకులు తాళ్లపెల్లి యుగేందర్, ముచ్చకుర్తి రమేశ్ ఉన్నారు.

మున్సిపల్ కార్పొరేటర్ల ఫోరం ఆవిర్భావం


సతీశ్‌కుమార్


శ్రీనివాస్

కోల్‌సిటీ: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో కార్పొరేటర్ల ఫోరం ఆవిర్భవించింది. ఈ మేరకు మంగళవారం పలువురు కార్పొరేటర్లు సమావేశయ్యారు. సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. పలు డివిజన్లలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు పూర్తయ్యేలా ప్రణాళికబద్ధంగా ముందుకు పోవడం, ఏడాదిలోగా ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తి చేసేలా కార్పొరేటర్లు ఐక్యంగా మున్సిపల్ అధికారులు, కాంట్రాక్టర్లను సమన్వయ పర్చాల్సిన అవసరం ఉందన్నారు. అభివృద్ధి పనుల విషయంలో అవసరమైతే పోరాటాలు చేస్తామని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలందించడమే ఫోరం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. అనంతరం కార్పొరేటర్ల ఫోరం కమిటీని ఎన్నుకున్నారు. కార్పొరేటర్స్ ఫోరం అధ్యక్షుడిగా కన్నూరి సతీశ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా మేకల సదానందం, ఎన్వి రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ధాతు శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా ఐత శివకుమార్, గన్ముక్కల మహాలక్ష్మి, కోశాధికారిగా నీల పద్మ, గౌరవ సభ్యులుగా వేగోళపు రమాదేవి, అమ్రిన్ ఫాతిమా, కాల్వ స్వరూప, గౌరవ సలహాదారులుగా సాగంటి శంకర్‌ను ఎన్నుకున్నారు.

విదేశాల్లో ఉద్యోగాలకు ప్రత్యేక డ్రైవ్

- 9న ప్రభుత్వ ఐటీఐలో నమోదు ప్రక్రియ
- జిల్లా ఉపాధి కల్పన అధికారి వై.తిరుపతిరావు

రామగుండం: ఆస్ట్రేలియా, యూఏఈ, జర్మనీ, పోలాండ్, లండన్ తదితర దేశాల్లో నిరుద్యోగ అభ్యర్థులకు ఉపాధి అవకాశం కల్పించనున్నామని జిల్లా ఉపాధి కల్పన అధికారి వై.తిరుపతిరావు తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో ఈనెల 9న టామ్.కామ్ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నామని, ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు పేర్లు నమోదు చేసుకోవచ్చని సూచించారు. వివిధ రంగాల్లో నైపుణ్యం కలిగిన వారికి ఉద్యోగావకాశాలు కల్పించేందుకు విదేశాల్లోని ప్రభుత్వ, ప్రయివేటు ఏజెన్సీలతో భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుందని తెలిపారు. అభివృద్ధి చెందిన దేశాలలో నైపుణ్యం కలిగిన కార్మికులకు అధిక డిమాండ్ ఉండడంతో ఆకర్షణీయ వేతన ప్యాకేజీ, అలవెన్సులు ఉంటాయని, అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ సురక్షితమైన, చట్టబద్ధమైన వలస మార్గాల ద్వారా సులభతరం చేయడంలో టామ్.కామ్ సహాయం చేస్తుందని పేర్కొన్నారు.

ఆస్ట్రేలియాలో.. మైనింగ్ ఇండస్ట్రీ ప్లాంట్ మెకానిక్/మెకానికల్ ఫిట్టర్, మెకానికల్ ఇంజినీర్, కన్వేయర్ బెల్ట్, టెక్నీషియన్, సీఎన్‌సీ మెషనిస్టు, వెల్డర్, బాయిలర్ మేకర్/ఫ్యాబ్రికేటర్.

యూఏఈలో.. ఐటీవీ డ్రైవర్, ఫోర్మెన్ ప్లేటర్/ఫ్యాబ్రికేటర్, మెషనిస్టు, ప్రిపరేటర్ స్ట్రక్చరల్, చుక్కాని అండ్ ప్రొపెల్లర్, పైపింగ్ సూపర్‌వైజింగ్, ఫోర్‌మెన్ మెషినిస్ట్, ఫోర్‌మెన్ మెకానికల్, షార్మాన్ పైప్.

జర్మనీలో.. మీట్ ప్రాసెసింగ్, ఫుడ్ రిటైల్ సేల్స్, కన్‌స్ట్రక్షన్, వేర్‌హౌస్ క్లర్క్, ట్రక్ డ్రైవర్, ఫిట్టర్, టర్నర్, సీఎన్‌సీ ఆపరేటర్. అనుభవం అవసరం లేదని, 22 నుంచి 28 ఏళ్ల వయస్సు ఉండాలి.

పోలాండ్‌లో.. వెల్డర్స్, ఫిట్టర్స్.

లండన్‌లో.. జాయినరీ కార్పెంటర్స్ విభాగాలు.

ఉత్సాహవంతులైన నిరుద్యోగ అభ్యర్థులు తమ పూర్తి వివరాలు, ధృవీకరణపత్రాలతో ఈనెల 9న ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో హాజరుకావాలని, వివరాలకు www.tomcom.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు. సంబంధిత ఏజెన్సీ ప్రతినిధుల ఫోన్ నంబర్లు 9701732697, 7893566493, 8328602231 సంప్రదించవచ్చని తెలిపారు.

పద్య, వచన, కవితల పోటీలు

పెద్దపల్లిరూరల్: దశాబ్ది వేడుకల్లో భాగంగా సాహిత్య దినోత్సవంలో పాల్గొనేందుకు ఆసక్తిగల కవులు, కవయిత్రిలు ఈనెల 7లోగా పేర్లు నమోదు చేసుకోవాలని డీఈవో మాధవి కోరారు. తెలంగాణ అస్తిత్వం, ప్రగతి ప్రతిబింబించేలా పద్య, వచన, కవిత పోటీలు తెలుగు, ఉర్దూ భాషల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలుగు భాషా పోటీల్లో పాల్గొనే వారు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలోని ఇంటర్ నోడల్ అధికారి కార్యాలయంలో సునీల్‌కుమార్ సెల్ 9849263284లో, ఉర్దూ భాషలో పాల్గొనే వారు మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ కార్యాలయంలో సెల్ 9440008814లో ఆయా అంశాలపై కవితలు సమర్పించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

చెరువుల పండుగ విజయవంతం చేయాలి

సుల్తానాబాద్‌రూరల్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చెరువుల పండుగ సందర్భంగా అన్ని గ్రామాల్లో బతుకమ్మ, బోనాల పండుగ ఘనంగా నిర్వహించి విజయవంతం చేయాలని ఎంపీపీ బాలాజీరావు కోరారు. సుల్తానాబాద్ మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ గురువారం చెరువుల పండుగ ఘనంగా నిర్వహించాలన్నారు. ఎంపీడీవో శశికళ, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఏర్పాట్ల పరిశీలన

ఓదెల: దశాబ్ది ఉత్సవాల్లో సందర్భంగా మండలంలో గురువారం జరిగే చెరువుల పండుగకు ఎంపీడీవో జి.సత్తయ్య ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. చెరువుల పండుగలో గ్రామస్తులు పాల్గొనాలని కోరారు.